క్లుప్తంగా

23 మందికి రూ.2.30 లక్షల జరిమానా



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: గత మూడు నెలల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున సాలూరు కోర్టు రూ.2.30 లక్షల జరిమానా విధించిందని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ నెల నుంచి ఆగస్టు వరకు రామభద్రపురం మండలంలో 16 మంది,బాడంగి మండలంలో ఏడుగురు వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా, కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించగా, కోర్టు జరిమానా విధించిందని చెప్పారు. ఎస్‌ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విక్రాంత్‌కు అభినందనలు



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అచ్చెన్నాయుడు, తదితరులు

రేగిడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాలకొండలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, పోలినాటి వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటం నాయుడు, సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెల్ల మన్మధరావు తదితరులు ఉన్నారు.

నేత్రదానం మహాదానం



నేత్రదాన అంగీకార పత్రాలను చూపిస్తున్న యోగా సాధకులు

రాజాం సిటీ: నేత్రదానం మహాదానమని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాల వద్ద యోగా సాధన చేస్తున్న వికాసతరంగిణి సభ్యులకు నేత్రదానంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు నేత్రదాన ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. ఒకరు చేసిన నేత్రదానంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని చెప్పారు. అలాగే నేత్రాలతో పాటు ఇతర అవయవాలను దానం చేయడంపై అపోహలు వీడాలని పేర్కొన్నారు.60 మంది యోగా సాధకులు నేత్రదానానికి ముందుకువస్తూ అంగీకారపత్రాలు అందజేశారు.జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, వికాస తరంగిణి సభ్యులు వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, డొంక త్రినాథులు, అబ్బులు, మన్మథ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కందిశలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మహిళలు

రేగిడి: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కందిశ, కొమెర, రేగిడి, ఆమదాలవలస తదితర గ్రామాల్లో ఆదివారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.

కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు



కల్వర్టు వద్ద ఆర్‌సీసీ పైపు ఏర్పాటు చేసి, రోడ్డుపై వేసిన మెటల్ సిప్స్

సంతకవిటి: మండలంలోని సంతకవిటి–చిత్తారపురం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో పోతుల జగ్గుపేట మూడురోడ్ల కూడలి వద్ద కల్వర్టు ఇటీవల కూలిపోయింది. ఆర్అండ్‌బీ ఏఈఈ సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.కూలిన కల్వర్టు వద్ద కొత్తగా ఆర్‌సీసీ పైపు ఏర్పాటు చేసి మట్టితో పూడ్చారు.రోడ్డుపై మెటల్ సిప్స్ వేశారు. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తాత్కాలికంగా ఇబ్బందులు తొలగాయి.

ఒక్క కట్ట కోసం.. అష్టకష్టాలు

- అందుబాటులో లేని యూరియా
- బొబ్బిలి నియోజకవర్గం వ్యాప్తంగా రైతులకు తప్పని తిప్పలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎరువుల దుకాణాల వద్ద నిరీక్షణ
- రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు
- ఇంతటి దారిద్ర్యం ఎప్పుడూ చూడలేదని అన్నదాత ఆక్రందన



రామభద్రపురం గ్రోమోర్ సెంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

రామభద్రపురం: కూటమి పాలనలో రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఎరువుల కొరత రోజురోజుకీ తీవ్రతరమవుతోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 90 శాతానికి పైగా పంటలు సాగులో ఉన్నాయి. పంటలకు ఎరువులు వేయాల్సిన సమయంలో యూరియా లభించక పోవడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే), ప్రాథమిక వ్యవ సాయ పరపతి సంఘాల కార్యాలయాలు (పీఏసీఎస్) మార్కెట్‌లో ప్రైవేటు దుకాణాల్లో ఎక్కడ యూరియా దొరుకుతుందా అన్న ఆశ తో రైతన్నలు రోజూ పరుగులు తీస్తున్నారు. ఆర్ఎస్‌కే, పీఏసీఎస్‌లు, ప్రైవేటు దుకాణాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ పనుల్లో ఉండాల్సిన రైతులు ఇలా ఆర్‌ఎస్‌కే, పీఏసీఎస్‌లు, ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ దుకాణాలు,వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా ఎక్కడా రైతులకు సరిపడా యూరియా దొరకడం లేదు. ఇంతటి దార్భిద్ర్యం తామెప్పుడూ చూడలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిలి నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు హెక్టార్లలో..		
మండలం	సాధారణ సాగువిస్తీర్ణం	సాగు చేసిన విస్తీర్ణం
రామభద్రపురం	4,453	3,245
బొబ్బిలి	7,787	7,945
బాడంగి	5.427	3,695
తెర్లాం	6.269	5,764

రైతుల పడిగాపులు..



తెర్లాం: గంగన్నపాడు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు రైతు సేవా కేంద్రం వద్ద ఆదివారం ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాశారు. రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు అక్కడికి పెద్ద ఎత్తున వచ్చారు. కొంతమంది రైతులు లైన్లో నిలబడగా, మరికొంతమంది రైతులు రైతు సేవా కేంద్రం వద్ద కూర్చొని తమ పేర్లు ఎప్పుడు పిలుస్తారా అని ఆధార్ ఎదురు చూశారు. రైతు సేవా కేంద్రానికి 222 బస్తాల యూరియానే రావడంతో ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున అందజేశారు. కొంతమంది రైతులకు యూరియా అందకపోవడంతో ఉసూరు మంటూ వెనుదిరిగారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ..

బొబ్బిలి నియోజకవర్గం వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగువిస్తీర్ణం 23,936 హెక్టార్లు కాగా , ఇప్పటి వరకు 20,645 హెక్టార్లలో వరి,పత్తి,మొక్కజొన్న తదితర పంటలు సాగులో ఉన్నాయి.ఇప్పటికి 7,230 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 4,810 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయినట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. సకాలంలో యూరియా వేయకపోవడం వల్ల పంటల్లో ఎదుగుదల లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వరినాట్లు వేసిన వారం పది రోజుల లోపు యూరియా,కాంప్లెక్స్ ఎరువులు వేస్తారు. కొన్నిచోట్ల నాట్లు వేసి 30 నుంచి 40 రోజులు అవుతున్నా పంటకు ఎరువు వేయలేదు. దీంతో పంట ఎదుగుదల లేకుండా పోయిందని, సకాలంలో ఎరువు వేయకపోతే పిలకలు వచ్చే అవకాశం ఉండదని రైతులు చెబుతున్నారు.

ఇప్పటికి అవరమైన యూరియా, సరఫరా జరిగిన వివరాలు మెట్రిక్ టన్నులలో)		
మండలం	అవసరం	సరఫరా అయింది
రామభద్రపురం	1,270	950
బొబ్బిలి	2,700	1,650
తెర్లాం	2,200	1,290
బాడంగి	1,260	920

రైతులు ఎక్కువ..స్టాక్ తక్కువ



బాడంగిలోని ఎరువుల దుకాణానికి యూరియా కోసం వచ్చిన రైతులు

బాడంగి: మండల కేంద్రంలోని రైతుడిపోకు నాలుగురోజుల క్రితం 400 బస్తాల యూరియా రాగా ఆదివారంతో ఆ స్టాక్ అయిపోయింది. రెండు ఎకరాల భూమి ఉండి, వన్‌బీ, ఆధార్ కార్డు చూపించిన వారికే యూరియా ఇస్తున్నారు. అది కూడా గంటల తరబడి క్యూలో ఉంటే ఒక్క బస్తానే ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.స్థానిక రైతు సేవా కేంద్రానికి యూరియా లోడ్ వచ్చినప్పటికీ పంపిణీ చేయలేదు. రైతులు ఎక్కువ,స్టాక్ తక్కువ ఉండడంతో ఏవిధంగా పంపిణీ చేయాలో తెలియక సిబ్బంది తలలుపట్టుకొంటున్నారు.

కట్ట దొరకడం కష్టంగా ఉంది



పొలం పనులు మానుకుని రోజంతా తిండి తిప్పలు లేకుండా ఎరువుల దుకాణాలు, ఆర్ఎస్‌కే వద్ద పడిగాపులు కాస్తున్నా కట్ట యూరియా దొరకడం కష్టంగా ఉంది.పది సెంట్లు భూమి ఉన్న రైతుకూ ఒక బస్తానే ఇస్తున్నారు, అయిదెకరాలు ఉన్న రైతుకూ ఒక బస్తాయే ఇస్తున్నారు. ఇలా అయితే ఎలా.? పంటలకు సకాలంలో ఎరువు వేయకపోతే దిగుబడి తగ్గిపోతుంది.

– మత్స లక్ష్మణ,రైతు,రామభద్రపురం

అష్టకష్టాలు పడుతున్నాం..



యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు,పీఏసీఎస్‌లు,ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ దుకాణాలు,వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఎక్కడా అందుబాటులో లేదు.ఏదో ఒక ఆర్‌ఎస్‌కేకు స్టాక్ వచ్చిందంటే అక్కడ గంటల కొద్దీ క్యూలో నిలబడితే ఒక్క బస్తా దొరకడం కూడా గగనంలా ఉంది. గతంలో ఇంతటి దార్బిద్ర్యం లేదు.సకాలంలో ఎరువులు దొరికేవి.రైతులను ఇలా ఇబ్బంది పెట్టడం మంచిది కాదు.

– కేతిరెడ్డి కృష్ణ,రైతు,రామభద్రపురం

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



కొద్ది రోజుల్లో యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రత్యామ్నాయంగా నానో యూరియా,అమ్మోనియా సల్ఫేట్‌ను పంటలకు పిచికారీ చయవచ్చు.ఇవి తక్కువ ధరకు లభిస్తాయి.పైగా భూమికి నష్టం జరగదు. కానీ రైతులు అలవాటు పడడం లేదు.

– మధుసూదనరావు,ఏడీ, బొబ్బిలి

'వారిపై చర్యలు తీసుకోండి'



జూట్ మిల్లు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: పట్టణంలో మూతపడిన లక్ష్మీ శ్రీనివాస జూట్‌మిల్లులోని ప్రభుత్వం భూమిలో రెవెన్యూ అధికారులు పెట్టిన బోర్డులను తొలగించిన వారిని గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. జూట్ మిల్లులో హెచ్చరిక బోర్డులు తొలగించిన ప్రదేశాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు ఆదివారం పరిశీలించిరు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ తారక రామాకాలనీ ఎదురుగా ఉన్న పాత జూట్ మిల్లు స్థలంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కూడా కొందరు చదును చేశారన్నారు. ప్రభుత్వ స్థలమని రెవెన్యూ అధికారులు బోర్డులు పెట్టినప్పటికీ వారు వాటిని తొలగించే ధైర్యం చేశారంటే కారణం ఏమిటన్నది అధికారులు దర్యాప్తు చేయాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోతే తామే పోరాడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న,పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు, నాయకులు సత్యనారా యణ,బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత

బొబ్బిలి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయంతో పాటు వేంకటేశ్వరాలయం, షిర్డీ సాయి ఆలయం, చల్లని బంగారమ్మ, గొల్లపల్లి దాడితల్లి ఆలయాలను పురోహితులు మూసివేశారు.తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుస్తామని తెలిపారు.

సంగమేశ్వర ఆలయం మూసివేత

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని సోమవారం తెరుస్తామని అర్చకులు సిద్ధాంతం గణపతిశర్మ తెలిపారు.



బొబ్బిలి: వేణుగోపాలస్వామి ఆలయాన్ని మూసివేసిన దృశ్యం



వంగర: సంగమేశ్వర ఆలయ ప్రధాన ద్వారాన్ని మూసి వేస్తున్న అర్చకుడు

యూరియా వినియోగం తగ్గించుకోవాలి



సంతకవిటి: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శారదాదేవి

సంతకవిటి: రైతులు పంటలకు యూరియా వినియోగం తగ్గించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.శారదాదేవి అన్నారు. 'రైతుకు యూరియా–వ్యవసాయశాఖ హామీ' పేరుతో బొద్దూరు సచివాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు యూరియా అధికంగా వేయడం వల్ల పంటలో పురుగు ఉధృతి అధికమవుతుందని అన్నారు. సాధారణ యూరియాకు బదులు నానో యూరియాను వినియోగించాలని చెప్పారు. ఎంపీడీఓ కె.సురేష్ కుమార్, ఏఓ సి.బి.యశ్వంతరావు, ఎంపీటీసీ వి.గణేష్ పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీ వినియోగించాలి

రేగిడి: సాధారణ యూరియా, డీఏపీలకు బదులుగా నానో యూరియా, నానో డీఏపీ వినియోగించాలని ఏఓ శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని చాటాయివలస, ఉంగరాడ తదితర గ్రామాల్లో రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు.

నానో యూరియాపై ఆసక్తి చూపాలి

వంగర: నానో యూరియాపై రైతులు ఆసక్తి చూపాలని ఏఓ కోట కన్నబాబు సూచించారు. సంగాం గ్రామంలో ఎంపీడీఓ రఘునాథాచారితో కలిసి రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. సచివాలయ వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో రూ. 82 వేలు పలికిన లడ్డూ



రాజాం: నందబలగలో రూ. 82 వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తుడు సీతారాంతో ఉత్సవ కమిటీ

రాజాం: మండలంలో నందబలగ గ్రామంలో వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా శ్రీరామ్ యూత్ గణేష్ మంటపంలో స్వామి వారికి ఉత్సవ కమిటీ నివేదించిన లడ్డూ ప్రసాదానికి ఆదివారం రాత్రి వేలం పాట వేశారు. గ్రామానికి చెందిన భక్తుడు కొర్ను సీతారాం రూ. 82 వేలకు లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నాడు. రాజాం పట్టణంలోని మారుతీనగర్‌లో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద మూడు లడ్డూలు వేలంపాట వేయగా..మొదటి లడ్డూ బూరాడ అప్పలనాయుడు రూ. 26వేలకు, రెండో లడ్డూ రౌతు సతీష్ కుమార్ రూ. 33 వేలకు, మూడో లడ్డూను కల్లేపల్లి శ్రీనివాసరావు రూ. 10,500కు దక్కించుకున్నారు.



రాజాం : మారుతీనగర్‌లో మొదటి లడ్డూను రూ. 26 వేలకు దక్కించుకున్న బూరాడ అప్పలనాయుడు



రాజాం : మారుతీనగర్‌లో రెండో లడ్డూను రూ.33 వేలకు దక్కించుకున్న సతీష్ కుటుంబీకులు

ప్రకృతి వ్యవసాయంతోనే మనుగడ



హాజరైన యోగాభ్యాసకులతో బీకే రాజేశ్వరి

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ సాధ్యమని బ్రహ్మకుమారీస్ బొబ్బిలి కేంద్రం ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి అన్నారు. స్థానిక బ్రహ్మకుమారీస్ కేంద్రంలో యోగాభ్యాసకులకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన గోసేవా సమితి హెడ్ ఆర్గనైజర్ రామోజీ మాట్లాడుతూ దేశీయ గోవుల గురించి వివరించారు.పిరమిడ్ యోగా శిక్షకులు చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

దత్తపీఠం నిర్వాహకులకు సన్మానం



దత్తపీఠం నిర్వాహకులను సన్మానిస్తున్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: ఆధ్యాత్మిక కేంద్రాన్ని నడపడం పూర్వజన్మ సుకృతమని పార్వతీపురంనకు చెందిన ఆధ్యాత్మిక వక్త కంచుమోజు రామ్మోహనరావు, కోటబొమ్మాళికి చెందిన జి.మోహనరావు అన్నారు. మండల కేంద్రంలోని దత్తపీఠాన్ని ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా దత్తపీఠం నిర్వాహకులు కిమిడి సూరపునాయుడు, కిమిడి రవికుమార్‌ను వారు సత్కరించారు. పాలకొండకు చెందిన జె.జగ్గారావు మాస్టారు, దత్తపీఠంకు చెందిన డి.యోగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన నిర్వహించనున్న ఈసమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అచ్చెన్నాయుడు, తదితరులు

రేగిడి: రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయు డు అన్నారు. చిన్నశిర్లాం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడు తూ యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద పారద ర్శకంగా ఎరువులు, విత్తనాల పంపిణీ జరిగేదని గుర్తు చేశారు. నేడు యూరియా అరకొరగా సరఫరా చేయడమే కాకుండా, టీడీపీ నాయకుల ద్వారా విక్రయిస్తుండడం దారుణమన్నారు. తోటపల్లి కాలువ నుంచి సాగునీరు పంటపొలాలకు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. సాగు నీటి వనరులపై ఇటు అధికారులు ,అటు ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదని ఆరోపించారు. ఈఏడాది సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అంద ని పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లి పెంటం నాయుడు, కింజరాపు సురేష్, కెల్ల మన్మధరావు, కరణం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నదాత పోరుతో ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం..



అన్నదాత పోరు వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న శంబంగి, తదితరులు

- ఎరువుల కొరతపై ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా రేపు
- రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలి
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రైతులకు ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆరోపించారు. ఎరువుల కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాతపోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత పోరు కార్యక్రమంతో కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపిద్దామని అన్నారు. మంగళవా రం ఉదయం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు.ఈధర్నాకి రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఎరువుల కొరత లేదనడం హాస్యాస్పదం

రాష్ట్రంలోని రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, ప్రైవేటు దుకాణాల వద్ద ఎరువుల కోసం రైతులు క్యూలు కడుతున్నారని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని అంటుడడం హాస్యాస్పదంగా ఉందని శంబంగి అన్నారు. ఎరువుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై అన్ని పత్రికల్లో వార్తలు వస్తున్నప్పటికీ అవన్నీ ఫేక్ న్యూస్‌లు అని సీఎం చెబుతుండడం దుర్మార్గమన్నారు.యూరియా బస్తాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించి, అధిక ధరలకు విక్రయించి కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, కౌన్సిలర్లు ఎస్.రామకృష్ణ,పాలవలస ఉమా శంకర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అన్వర్ భాషా, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్ల్యూ.వి.ఎల్.ఎన్.రాయలు,రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలపై అవగాహన ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న డీసీసీబీ సిబ్బంది, యువకులు

మెంటాడ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)సేవలపై ఆదివారం ఉదయం మండల కేంద్రం మెంటాడలో సెంట్రల్ బ్యాంకు ఏజీఎం అరసాడ శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం బైక్‌లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ మెంటాడ మండలంలోని చల్లపేటలో ఉన్న డీసీసీబీ బ్రాంచ్ సేవలను రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. డీసీసీబీలో డిపాజిట్లు చేస్తే మిగతా బ్యాంకుల కంటే అధిక వడ్డీ వస్తుందని, ఈ బ్యాంకు లో రైతులకే కాకుండా మిగతా ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. చల్లపేట బ్రాంచ్ మేనేజర్ పాండ్రంకి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నారాయణరావు, మెంటాడ పీఏసీఎస్ సీఈఓ వెంపడాపు ప్రసాదరావు,సిబ్బంది పతివాడ విశ్వేశ్వరరావు, అరసాడ విజయ్‌మూర్తి, పి.చిరంజీవి, స్థానిక యువకులు పాల్గొన్నారు.